

# ఆమె హృదయం

జయధర్ తిరుమలరావు

ఐదేళ్ళ తదుపరి ప్రసూనని చూడబోతున్నాను!

ఇన్నాళ్ళుగా నాలో పెరిగిన కోరిక మరో పది నిమిషాల్లో తీరబోతున్నందుకు ఆనందంగా ఉంది.

హైదరాబాదు నుండి బెంగుళూరుకు చేరేలోపల ఎన్నో ఆలోచనలు. ఎన్నో మరిగిన స్వప్నాల్లాంటి జ్ఞాపకాల అనుభూతులు వెచ్చగా కదులుతున్నాయి. ఎలా కలుస్తాను? ప్రసూన ఎలా ఆహ్వానిస్తుంది? అన్న ఊహలు.

నేను కూచున్న టాక్సీ బెంగుళూరు

లోని ఓ అజీరోడ్డుమీద వేగంగాపోతోంది. ఆ కొత్త ప్రదేశాన్ని చూడాలన్న ఆలోచనే లేదు.

నాకు తెలుసు. ఈ ఇంటర్వ్యూకు రావడం కేవలం ఒక బహానా మాత్రమే. బెంగుళూరు యూనివర్సిటీలో రీడరు పోస్టు కోసం అడ్వర్టయిజ్‌మెంటు పేపర్లో చూసిన మరుక్షణమే అక్కడున్న ప్రసూన గుర్తుకొచ్చింది.

ఈ ఐదేళ్ళూ ప్రసూనని మరిచిపోవాలని చేసిన ప్రయత్నాలు మరుగున పడి హృదయవేదన ఇంకా పెరిగింది. ఆమెని మరువలేనని తెలుసు. అందుకే ద్వేషించడం మొదలుపెట్టాను. ద్వేషిస్తూనే ఆరాధిస్తున్నాను!

చిన్నతనం నుండి ఆమెని ప్రేమిస్తున్నాను. ఆమెని ప్రేమిస్తున్న విషయం నాకే ఆలస్యంగా తెలిసొచ్చింది. ఆమెకు ఇంకా ఆలస్యంగా తెలిసింది.

ఆమెని ప్రేమిస్తున్నానని చెప్పలేదు. కాని ఆమెకు తెలుసునని నాకు తెలుసు. ఐతే ప్రసూనకి నేనంటే ప్రేమని ఖచ్చితంగా చెప్పడానికి నేనిప్పుడు కేలికులేషన్స్ చేస్తుంటాను — అదింకా తేలని సమస్య.

నేను మాత్రం కుమిలిపోయానే తప్ప పెదవి కదల్పలేదు. ఆమె చూపుల్ని, చేతల్ని చూస్తూ ప్రేమకనబరిచిన క్షణం నా ఆవేదనని విన్నవించుకోవా లనుకున్నాను. చెప్పడానికి ఎన్నో ప్రయత్నాలు చేసాను. కాని ఆమె ముఖకవళికలు మారేవి. నాలో నీరసం ఆవరించేది. ఇలా కొన్నేళ్ళు గడిచాయి కాని ప్రసూనతో సరిగా ధైర్యంగా మాట్లాడలేక పోయేవాణ్ణి.

ఆమెకి నాపై ఎలాంటి భావం ఉందోనని తెలుసుకోవడానికి వేచి చూడ్డంతోనే కాలం గడిచిపోయింది.

అప్పుడే పెళ్ళి వద్దని ఎంత మారాం చేసినా మేనబావ రాజశేఖరంతో పెళ్ళి నిశ్చయించారు.

అప్పటికీ ప్రసూన కళ్ళలో ఎలాంటి భావం కనిపిస్తుందానని చూసాను. ఏ భావం వ్యక్తం చేయలేదు. తికమక పడ్డాను. నా మీద అలాంటి భావం లేదేమో! కోపం, పగ, ద్వేషం ఆవరించాయి.

ఇప్పటికీ నా జీవితంలో శాంతి గల క్షణం లేదు. ఎన్ని రోజుల తదుపరైనా ఆమెను చూడబోతున్నందుకు సంతోషంగా ఉంది. ప్రసూనతో హృదయం విప్పి మాట్లాడాలని ఓవైపు-కేర్‌లెస్‌గా ప్రవర్తించి - తనంటే లెక్కలేనట్టు నటించాలి అని ఒకవైపు-ఆమెని మరిచి పోయినట్లు చెప్పాలి అలా చెప్పి ఆమె పడే బాధను చూచి సంతోషించాలి. అప్పుడే నాకు తృప్తి.

కారు మొదలియార్ రోడ్డు సెంటర్ దాటింది. అడ్రసు ప్రకారం ఇల్లు కొద్ది దూరంలోనే ఉంది. సాయంకాలం

కావడం వల్ల రాజశేఖరం ఎలాగూ బయటకు పోతాడు—ప్రసూన ఒంటరిగా కనిపిస్తుంది. ఇది నా ప్లాన్.

నేను చెప్పిన గుర్తుదగ్గరే టాక్సీ ఆగింది. డైరీలోని డోర్‌నంబర్ చూసాను. అదే ఇల్లు.

నాలో సన్నని వొణుకు ప్రారంభమైంది. ఏదో తెలియని బిడియం ఆవహించింది. వెనక్కిపోతే బావుండు ననిపించింది. కాని ఇన్నాళ్ళూ నాలో పడ్డ బాధనంతా ప్రసూనకి తెలియజేయకుండా, ఎంతో సుఖంగా ఉన్నట్లు చెప్పి ఆమె కళ్ళలోని భావం చదివి గొప్పతనం ఫీల్ కావాలని నా ఆలోచన. నా కోర్కె నెరవేరకపోతే జీవితంలో తృప్తి ఉండదు. ఆ తృప్తికోసం ఏమైనా చేస్తాను. ఏది ఏమైనా ప్రసూన హృదయాన్ని గాయపరచందే ఈ బెంగుళూరు పరిసరాల్ని దాటను.

గబగబా గేటు తీసుకుని లోనికి నడిచాను. వరండాలో ఎవరూ లేరు. మూడు నాలుగు పేం కుర్చీలు, పూల కుండీలు తప్ప. బటన్‌మీద చేయి వేసాను. తెరిచిన కిటికీలోంచి రాజశేఖరం వస్తూ కనిపించాడు. బయటకు వెళ్ళడానికి తయారయ్యాడులా ఉంది - చేతిలో ఏదో ప్యాకెట్ పట్టుకున్నాడు.

చూడగానే నన్ను గుర్తుపట్టలేదు. ఓ క్షణం తరువాత "మీరు మూర్తి కదూ! పూర్తి పేరు మరిచాను. సారీ!" అన్నాడు.

మళ్ళీ తనే "ఎప్పుడొచ్చారు? అక్కడ మామయ్య వాళ్ళు కులాసా?" కూర్చోమ్మని సైగచేసి కూర్చుంటూ అన్నాడు.

"ఆఁ! అంతా కులాసాయే! .... యూనివర్సిటీలో పని ఉంది. వచ్చి వారం రోజులైంది." అన్నాను గొప్పగా.

"మధ్యలో ఒక్కసారన్నా రాక పోయారా? ఏం పరాయివాళ్ళ మనుకున్నారా? అక్కడికొచ్చినపుడు మీరెంత శ్రద్ధతో కంపెనీ ఇస్తారు! మరిచాననుకున్నారా?" నొచ్చుకుంటూ అన్నాడు.

నాకు కావల్సింది కూడా అదే.

నౌకర్ని పిలిచి కాఫీ తీసుకు రమ్మన్నాడు.


కాఫీ తాగుతూ హుషారుగా మాటలు మొదలుపెట్టాడు. రాజశేఖరం మాటల్లో పడ్డాడంటే ఓ పట్టాన వదలడు. మొహమాటం లేకుండా మాట్లాడేస్తుంటాడు.

నా మనస్సంతా ప్రసూనపైనే ఉంది. ఎప్పుడొస్తుందా అని చూడసాగాను.

ఆ మాటా ఈ మాటా లోంచి తన సంసారంలో పడ్డాడు.

"అవునండీ! నేనూ, ప్రసూ ఒక్కసారి కూడా పల్లెత్తుమాట అనుకోలేదు. ప్రసూ చాలా మంచిది. ఆమె లభించడం వరం...."

కాఫీ కప్పులు తీసుకెళ్ళడానికి వచ్చిన నౌకరుతో "ఏరా! ఇప్పుడేమంటోంది నీ భార్య? చూడండి! చిన్న చిన్న గిల్లి




కజ్జాలు పెట్టుకొని భార్యా భర్తలు విడాకులు తీసుకుంటామనే వరకు వచ్చింది. ఎల్లాగో మేమే సర్దేశాం. చిన్నవాటికి ఎవరో ఒకరు సర్దుకోవాలి. అన్నట్లు చూడండి! ఈరోజు ప్రసూన బర్త్‌డేకి ప్రజంటేషన్‌గా ఈ బ్లూకలర్ చీర తెస్తే - లేదూ తనకిష్టమైన లైట్ రోజ్‌కలర్ చీరే కావాలని మారాం చేస్తుంది. ఎంత చెప్పినా వినదు. అందుకే వాపసిచ్చి తనకు ఇష్టమైందే తీసుకురావడానికి పోతున్నాను. పుట్టినరోజు పార్టీకి మీరు రావడం నిజంగా విశేషమే. చాలా సంతోషంగా ఉంది....”

“సంసారం అంటేనే అంత. సర్దుకుపోవాలి.” అన్నాను, ఏమీ మాట్లాడకపోతే బావుండదని. నా దృష్టి అంతా తలుపు దగ్గరే ఉంది.

“అవునండీ! ఓసారి ఇలాగే జరిగింది మా బాబుకు పేరు పెట్టే దగ్గర పేచీ వచ్చింది. ఎంతసేపూ ఈ ఆడవాళ్ళు పట్టు పట్టనే పట్టరు. పట్టారా పట్టు విడుపే ఉండదు. ఎన్నో మంచి పేర్లు సెలెక్ట్ చేస్తే ఒకటీ విన్లేదు. తన పంతమే నెగ్గాలంటుంది. ఆడవాళ్ళకు అంత పట్టుదల ఎందుకో అర్థంకాదు. మీకిలాంటి అనుభవం కాకపోతే, ఇక ముందు ఇలాంటి సమస్యలే వస్తే మాత్రం వాళ్లు చెప్పిందే చెయ్యండి. అదే మంచిది. అన్నట్లు ప్రసూన స్నానం చేస్తున్నది. ఇప్పుడే వచ్చేస్తుంది. నేను

కూడా." అంటూ లేచి, "హైదరాబాదు నుండి అతిథులొచ్చారని అమ్మగారికి చెప్పు" అంటూ లేచి, వెళ్ళిపోయాడు.

ఒంటరిగా కూచున్నాను. నాలో ఏదో జ్ఞాపకం లీలగా మెదులుతోంది. కాని దాన్ని పట్టించుకునే స్థితిలో లేను. కిటికీ లోకి చూసాను. ప్రసూన కనిపించింది - తలంటి పోసుకుని వొదులుగా అల్లుకున్న జడలో రోజాని తురుముతూ.

త్వరగా వస్తే నాలోని విషం కక్కాలని తపన!

"బాబూ" అని పిలుస్తూ మరో గదిలోకి వెళ్ళింది.

నాలో అంతర్గతమైన జ్ఞాపకం రెక్కలు విప్పుకుంది. ప్రసూన పెళ్ళికి ముందుసంవత్సరం పుట్టినరోజుకి అనుకోకుండా బట్టలషాపులో కనిపించాను. ప్రసూన తన స్నేహితులతో చీరెలు చూస్తోంది. ఏ చీర తీసుకోవాలో ఆలోచిస్తున్నది. లైట్ రోజ్‌కలర్ చీరె ఒకటి సెలెక్ట్ చేసి చూపాను. బర్త్‌డే నాడు అదే చీరతో ప్రత్యక్షమైంది.

తున్నాయి. ప్రసూనకి, లైట్ రోజ్ కలర్ అంతగా ఇష్టమైతే ఆనాడు నేను చెప్పాల్సిన అవసరం ఉండకపోయేది. మరి....

"చంద్రకాంత మూర్తీ...."

లోపలనుండి వినొచ్చింది. నా ఒళ్ళు ఝల్లుమంది. నరాలన్నీ ఆకుల్లా కదిలాయి. నే నొచ్చినట్లు ఎలా తెలిసింది? మరి లోపలనుండే ఎందుకలా పిలుస్తోంది? నా గుండెలు తడారిపోయాయి!

"చంద్రా ... నువ్విక్కడున్నావా? పద," అంటూ తన నాలుగేళ్ళ కొడుకుని చేయిపట్టుకుని వస్తూ కనిపించింది. అప్పుడర్థమయింది నాకు. ఐనా నాలో ఏవో ఆలోచనలు. ఏవో సుడిగుండాలు. ప్రశ్నల తుఫానులు!

నా పేరు పెట్టుకోవడం కోసం భర్తతో పేచీ పెట్టుకుంది-

అంతే....

ఎందుకో నా కక్కడ ఉండాలనిపించలేదు. గబుక్కున బయటకు నడిచాను.

